క్లుప్తంగా

కోనలో 13న హనుమద్వ్రతం

రాపూరు : మండలంలోని పెంచలకోనలో ఈ నెల 13వ తేదీన హనుమద్వ్రతం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, క్షేత్రోత్సవం చేపడతామని వెల్లడించారు. పెంచలకోన క్షేత్రంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి అభిముఖంగా క్షేత్ర పాలకుడైన ఆంజనేయ వెలిశారు. ఈ క్రమంలో ఆయనకు ఉదయం 5 గంటలకు అభిషేకం, పూలంగి సేవ, 8 గంటలకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బోధనలో మెళకువలు పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

దక్కిలి : పాఠ్యాంశాల బోధనలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన గురువారం కుప్పాయిపాళెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ బోధనలో మెళకువలు పాటించాలన్నారు. విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ప్రతి రోజూ భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

పొదుపు సంఘాల బలోపేతానికి చర్యలు

సైదాపురం: పొదుపు సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏరియా కోఆర్డినేటర్ జి.మధుసూదన్ తెలిపారు. సైదాపురంలో గురువారం మండల సమాఖ్య పరిధిలోని సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ బుక్ కీపింగ్, వీపీఆర్, పీవోఎస్‌డీసీ, జెండర్ కార్యక్రమాలపై సమీక్షించారు. అలాగే స్త్రీనిధి, ఉన్నతికి సంబంధించిన రికవరీలను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంలు చంద్రశేఖర్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సులభంగా ఆంగ్ల భాషా బోధన



సర్టిఫికెట్ అందుకుంటున్న ఉపాధ్యాయుడు

దక్కిలి : విద్యార్థులకు ఆంగ్ల భాషను బోధించడం ఎంతో సులభమని మండలంలోని వెలంపల్లి ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పెంచలయ్య తెలిపారు. ఆయన బెంగళూరులోని ఆర్ఐఈఎస్ఐలో ఆంగ్ల భాషలో సర్టిఫికెట్ కోర్సులో నెల రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో ఆంగ్ల భాషను సులభంగా ఎలా నేర్చుకోవచ్చో తెలియజేశారని పేర్కొన్నారు. సులభమైన పద్ధతిలో పిల్లలకు ఇంగ్లీషును నేర్పించడానికి ప్రయత్నం చేస్తామన్నారు.

వీహెచ్‌పీ సావనీర్ ఆవిష్కరణ



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం వీహెచ్‌పీ సావనీర్‌ను ఆవిష్కరించారు. బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు అనిమెళ్ల శివకుమార్ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సావనీర్‌ను విడుదల చేసినట్టు తెలిపారు. ఈ పుస్తకం హిందూతత్వాన్ని బోధించేలా ఉంటుందన్నారు. ప్రతి హిందువు తమలోని దేశ భక్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కడివేటి రామామూర్తి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

కోట : మండలంలోని కేశవరం వద్ద ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మూర్తి నవీన్(22) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. నెల్లూరుకు చెందిన నవీన్, చందు, నాయబ్ మోటార్ బైక్‌పై కోటకు వస్తుండగా రోడ్డుపై ఉన్న గేదెను ఢీకొట్టారు. ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వారిని నెల్లూరుకు తరలించగా నవీన్ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రెండు రోజులుగా రోడ్డు పైనే వాహనాలు



రోడ్డు పక్కన నిలిపిన గాలి మర రెక్కలు తరలించే వాహనాలు

చిల్లకూరు : జాతీయ రహదారిపై రెండు రోజులుగా గాలి మర రెక్కలు తరలించే వాహనాలు నిలిచి పోయి ఉన్నాయి. తమిళనాడు నుంచి గాలి మరల రెక్కలను తీసుకుని రెండు వాహనాలు విశాఖపట్టణానికి ఐదు రోజుల క్రితం బయలుదేరాయి. వర్షాలు కురుస్తుండడంతో ఎగువ ప్రాంతం నుంచి వరదలు వస్తుండడంతో వాహనాలను చిల్లకూరు మండలంలోని జాతీయ రహదారిపైనే నిలిపేశారు. సుమారు 60 అడుగుల పొడవు ఉండే గాలి మరల రెక్కలు రోడ్డు పక్కనే నిలిపి ఉండడంతో వాటిని ఆ మార్గంలో వెళ్లే వారు ఆగి మరీ చూసి ఎంత పొడవు రెక్కలో కదా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా వరినాట్లు

పాపిరెడ్డికండిగ చవట వద్ద వరి నారు పీకుతున్న కూలీలు



పున్నేపల్లి వద్ద నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన మడి



కలుజు పారుతున్న కొండవల్లిపాడు చెరువు



- బిజీ బిజీగా అన్నదాతలు
- 1,500 హెక్టార్లలో వరినాట్లు



ఓజిలి: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. చెరువుల్లోకి నీరు చేరింది. వాగులు, వంకలు జోరుగా ప్రవహిస్తున్నాయి. కొండవల్లిపాడు, కురుగొండ తదితర గ్రామాల్లోని చెరువుల కలుజులు పారుతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని రైతులు వరి పంట సాగు చేసే పనులు చేపట్టారు. ముందుగా వేసుకున్న పచ్చిరొట్ట పంటలను ట్రాక్టర్లతో దుక్కిచేసి పొలాలను నాట్లకు సిద్ధం చేసుకుంటున్నారు. వరినాట్లు పూర్తి చేసిన రైతులు పంటలకు ఎరువులను చల్లుతున్నారు. మండలంలో 1,500 హెక్టార్లలో 3,500 ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నట్టు అధికారులు తెలపారు.



కొత్తపేట వద్ద వరి నాట్లు వేస్తున్న మహిళలు

దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ



దివ్యాంగులకు ఫల సరుకులు అందజేస్తున్న మహిళా మండలి సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణానికి చెందిన రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సహకారంతో దాతలు డాక్టర్ తనూజ, లేట్ మనపాటి విక్టోరియమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గురువారం 37 మంది దివ్యాంగులకు ఫల సరుకులు అందజేశారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రతినెలా దాతల సహకారంతో సరుకులు అందజేయడం అభినందనీయమన్నారు. ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి అనిత, సభ్యులు స్నేహలతరెడ్డి, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

కండలేరులో 54.674 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో గురువారం నాటికి 54.500 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి 1,350 క్యూసెక్కులు, సోమ శిల జలాశయం నుంచి 2,150 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,200, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నేతలు



పెళ్లకూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోకవర్గంలో పార్టీ స్థితిగతులను వివరించారు. నాయకులు కుదిరి చక్రపాణి, వీరకుమార్, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

- నేటి నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు
- గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరురూరల్/రాపూరు/సైదాపురం/వెంకటగిరి (సైదాపురం)/దొరవారిసత్రం/సూళ్లూరుపేట రూరల్/నాయుడుపేట టౌన్ : రెవెన్యూలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా తెలిపారు. ఆయన గురువారం గూడూరు డివిజన్‌లోని తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సదస్సులపై దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్క అధికారీ తప్పనిసరిగా సదస్సుల్లో పాల్గొనాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సదస్సుల్లో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, రైతులు తమ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని సూచించారు. అదేవిధంగా రాపూరు, సైదాపురం, వెంకటగిరి, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, నాయుడుపేట మండలాల తహసీల్దార్లు రెవెన్యూ సదస్సుల గురించి వివరించారు. రైతులు తమ సమస్యలపై రాతపూర్వకంగా అర్జీలు అందజేయాలని, వాటిని పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

మూఢ నమ్మకాలు విడనాడాలి

చిల్లకూరు : మూఢ నమ్మకాలను విడనాడి, సైన్సుపై అవగాహన పెంచుకోవాలని జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గూడూరు పట్టణంలోని బాలాజీ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం మూఢ నమ్మకాలు-వాటిపై అవగాహన అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు వేల కిలోమీటర్ల దూరంలోని కక్షలోకి ఒకేసారి అనేక ఉపగ్రహాలను పంపుతున్నారని తెలిపారు. సైన్సు అభివృద్ధి చెందినా ఆరోగ్యం బాగలేనప్పుడు వైద్యుల దగ్గరకు కాకుండా తాంత్రికుల వద్దకు వెళుతున్నారని తెలిపారు. అలాంటి వారికి సైన్సుపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాగరాజు, చెంచునారాయణ, రాధయ్య, ప్రభాకర్, కళాశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో జేవీవీ సభ్యులు

భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేయాలి



రైతులకు భూసార పత్రాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్ : భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగుచేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రపంచ నేలల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులను వినియోగించుకోవాలన్నారు. ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వాడడం అలాటుగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు భూసార పరీక్షల ఫలితాల పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సుజాత, హెచ్‌వో ఆనంద్, కేవీకే శాస్త్రవేత్తలు రాజీవన, నాగార్జునరెడ్డి, తిరుపాల్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతల నిరసన



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

చిల్లకూరు : గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట గురువారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) నేతలు నిరసన తెలిపారు. ఎస్‌డబ్ల్యూఎఫ్‌లోని కార్మికులను డిపో మేనేజర్ చులకనగా చూస్తున్నారని, అక్రమంగా సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. సస్పెన్షన్‌లో ఉన్న కండెక్టర్లు, డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిపో మేనేజర్ కార్మికులపై వేధింపులు మానుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రాము, భాస్కర్, క్రిష్ణయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య, వాసు, డీపీరావు, అడపాల ప్రసాద్, గుర్రం రమణయ్య, ఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ స్థలాలకు రక్షణ కల్పిస్తాం

కోట : మండల కేంద్రమైన కోటలో జిల్లా పరిషత్ స్థలాలకు రక్షణ కల్పిస్తామని జెడ్పీ డిప్యూటీ సీఈవో జయమోహన్‌రావు తెలిపారు. ఆయన గురువారం కోట బజారువీధి, ఆకుతోట దిబ్బలో ఆక్రమణలో ఉన్న స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ హైస్కూల్స్‌కు గతంలో కేటాయించిన విలువైన స్థలాలు నేడు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. వాటిని సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఆకుతోటదిబ్బలో ఉన్న జెడ్పీ భవనాన్ని సాయిబాబా భక్తుల కోరిక మేరకు ధ్యాన మందిరం, లైబ్రరీ ఏర్పాటు చేసుకునేందుకు అద్దెకు ఇచ్చామన్నారు. బాలికల హైస్కూల్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో వేణు, హెచ్‌ఎం విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



కోటలో జిల్లా పరిషత్ స్థలాలను పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో

రేపు అయ్యప్పస్వామి అఖండ జ్యోతి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని గాంధీ పార్కు వద్ద శనివారం రాత్రి 43వ అయ్యప్ప స్వామి అఖండ కర్పూర జ్యోతి పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. జ్యోతి పూజోత్సవానికి నాయుడుపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. శనివారం ఉదయం గణపతి హోమంతో వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం కలశాల ఊరేగింపు, స్వామి వారికి పంచవాయిద్యాలతో పూజలు చేపడతారు. రాత్రి 7 గంటలపైన అఖండ జ్యోతి ప్రజ్వలన, అయ్యప్పస్వామి నగరోత్సవం నిర్వహించనున్నారు. కేరళ పంచవాయిద్యాల నడుమ వందలాది మంది మహిళలు దీపాలను చేత పట్టుకుని నగరోత్సవంలో పాల్గొంటారు.

500 కేజీలకు పైగా కర్పూరంతో అఖండ జ్యోతి

పట్టణంలో 42 ఏళ్లగా జరుగుతున్న అఖండ జ్యోతి పూజోత్సవానికి తారక ప్రభు అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు కోటకొండ గంజేంద్ర, చక్రపాణి, అధ్యాపకులు గాదిరెడ్డి గోపి తదితర గురుస్వాములు 500 కేజీలకు పైగా కర్పూరాన్ని సేకరిస్తారు. నాయుడుపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల అయ్యప్ప మాలధారులు ఇక్కడి జ్యోతి పూజ తర్వాతే శబరిమలకు వెళతారు. ఆదివారం అన్నదానంతో జ్యోతి ఉత్సవాలు ముగిస్తారు.



అఖండ జ్యోతి పూజోత్సవానికి గాంధీ పార్కు వద్ద విద్యుత్ దీపాలంకరణలు

వేలూరుకు ఎమ్మెల్యే పరామర్శ

పెళ్లకూరు : టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డిని గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, పలువురు నాయకులు పరామర్శించారు. మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్ధన్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో వారు గురువారం శిరసనంబేడులోని వేలూరు నివాసానికి వెళ్లి జనార్ధన్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నాగేంద్రరెడ్డి, సిద్దులనాయుడు, మురళీనాయుడు, రామకృష్ణంరాజు, హరిబాబురెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, హరినాయుడు, యుగంధర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



జనార్ధన్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, తదితరులు.

ప్రశాంతంగా ముగిసిన రైల్వే ఎన్నికలు

నాయుడుపేట టౌన్ : సదరన్ రైల్వే ఉద్యోగ, కార్మిక సంఘాలకు సంబంధించిన ఎన్నికలు గురువారం సాయంత్రం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 274 మంది ఓటర్లు ఉండగా గురువారం సాయంత్రం 6 గంటలకు 250 ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. పోస్టల్ బ్యాలెట్లు 6 వచ్చినట్లు వెల్లడించారు, మొత్తం 92 శాతం పోల్ అయినట్లు వివరించారు. ఈ ఎన్నికల్లో ఎస్ఆర్ఎంయూ, డీఆర్ఈయూ డీఆర్‌కేఎస్, ఎస్ఆర్ఈఎస్ తదితర సంఘాల నేతలు పోటీ పడ్డారు. గూడూరు నుంచి దొరవారిసత్రం వరకు ఉన్న రైల్వే ఉద్యోగులు, కార్మికుల కోసం నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే నెల 12వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి.



ఎన్నికల్లో పాల్గొన్న డీఆర్ఈయూ నాయకులు

ఘనంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులో గురువారం అయ్యప్ప భక్తులు అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకాడు, గొల్లపాళెం గ్రామాల్లో అయ్యప్ప మాల ధారణ చేసిన భక్తులు ట్రాక్టర్‌పై గణపతి, సుబ్రమణ్యం స్వామి, అయ్యప్ప స్వామిల చిత్ర పటాలను అలంకరించి గ్రామాల్లో ఊరేగించారు. మధ్యాహ్నం వాకాడు గ్రామానికి చెందిన అమలాంబ సమేత శ్రీ పరిపూర్ణానంద సామి వారి సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనుస్వామి, తిరుపాల్ స్వామి, మణి స్వామి, అంకయ్య స్వామి, సుబ్బారావు స్వామి పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

అల్లు అర్జున్ అభిమానుల సంబరాలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని శ్రీవెంకటేశ్వర, సీఎస్ తేజ థియేటర్లలో గురువారం పుష్ప-2 సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. రెండు థియేటర్ల వద్ద బుధవారం రాత్రి ప్రదర్శించిన అభిమానుల బెనిఫిట్ షోలో అభిమానులు భారీగా తరలి వచ్చారు. తీన్‌మార్ బ్యాండులతో కోలాహలం సృష్టించారు. సీఎస్ తేజ థియేటర్ వద్ద అభిమానులు పగడాల శివప్రదీప్, ముత్యాల రెడ్డి, సాయి, హంసాపృథ్వీ తదితరులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. థియేటర్ల వద్ద తొక్కిసలాటలు లేకుండా సీఐ బాబీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



సీఎస్ తేజ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న అల్లు అర్జున్ అభిమానులు

ప్రయోగం.. విజయవంతం

రెండోదశ ప్రయాణం చేస్తున్న పీఎస్ఎల్‌వీ రాకెట్



రాకెట్ రెండో దశలో విడిపోతున్న ఉపగ్రహానికి రక్షణకవచాలుగా వున్న హీట్ షీల్డ్స్



రెండో దశ పూర్తయిన తర్వాత విడిపోతున్న రాకెట్





మొదటి దశలో శ్రీహరికోట నుంచి నింగి వైపుకు ప్రయాణిస్తున్న పీఎస్ఎల్‌వీ సీ59 రాకెట్


- నాలుగు దశల్లో పీఎస్ఎల్‌వీ సీ59 రాకెట్ ప్రయోగం
- ఇస్రో ఖాతాలో మరో మైలురాయి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి గురువారం సాయంత్రం 4.04 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ59 రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగించారు. మొదటి, మూడో దశలు ఘన ఇంధనంతో, రెండు నాలుగు దశలు ద్రవ ఇంధనంతో పూర్తి చేశారు. ఈ ప్రయోగంలో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన 550 కిలోల ప్రోబా-3 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు. బుధవారమే ప్రయోగించాల్సి ఉండగా ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తడంతో గురువారానికి వాయిదా వేశారు. 44.4 మీటర్ల పొడవు కలిగిన రాకెట్ ప్రయోగ సమయంలో 2,320 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి పయనమై 18.39 నిమిషాల్లో గమ్యాన్ని చేరుకుంది. ప్రోబా ఉపగ్రహ ప్రయోగం సూపర్ సక్సెస్ కావడంతో ఇస్రో ఖాతాలో మరో మైలురాయి చేరింది. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సూళ్లూరుపేట



మూడోదశలో 550 కిలోల బరువు కలిగిన ప్రోబా-5 ఉపగ్రహాన్ని మోసుకుని వెళుతున్న రాకెట్



నాలుగో దశ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న రాకెట్



నాలుగో దశ ద్రవ ఇంధన మోటార్‌తో ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదిలిపెడుతున్న రాకెట్